



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
19-02-2026
పేజీలు: 02

# సామాజిక, ధార్మిక విప్లవకారుడు శివాజీ



ఛత్రపతి శివాజీ మహారాజ్ అనగానే ఓ గొప్ప పోరాట యోధుడు గుర్తుకువస్తారు. శక్తిమంతులైన మొగలాయి రాజులను తన యుద్ధ తంత్రాలతో వణికించిన అద్వితీయమైన యుద్ధ నైపుణ్యమే గుర్తుకొస్తుంది. అయితే, ఆయన భారతీయ సామాజిక ముఖచిత్రాన్ని మార్చిన ఓ గొప్ప విప్లవకారుడిగా కూడా చరిత్రలో నిలిచిపోయారు. ఆయన పాలనలో నెలకొన్న సామాజిక సమానత్వం, రైతు సంక్షేమం, పారదర్శకతను మహాత్మా జ్యోతిబాఫూలే, డా. బి. ఆర్.అంబేడ్కర్ వంటి మహనీయులు అత్యంత లోతుగా విశ్లేషించారు. శివాజీ మహారాజ్‌లోని బహుముఖ ప్రజ్ఞ, సామాజిక దృక్పథం నేటికీ ఆదర్శంగా ఉంది. చరిత్రను కేవలం యుద్ధాల కోణంలో చూస్తే శివాజీ ఒక వీరుడు. సామాజిక న్యాయం కోణంలో చూస్తే ఆయన ఒక యుగపురుషుడు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం, రైతుల శ్రేయస్సు కోసం ఆయన నిర్మించిన 'స్వరాజ్యం' నేటి ఆధునిక ప్రజాస్వామ్యానికి పునాది. 19వ శతాబ్దంలో శివాజీ మహారాజ్ అసలు చరిత్ర మరుగున పడిపోతున్న తరుణంలో, మహాత్మా జ్యోతిబాఫూలే దానిని వెలుగులోకి తెచ్చారు. శివాజీ వారసత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి మొదటిసారిగా జయంత్యుత్సవాలను నిర్వహించారు. రైతులను దోపిడీ చేసే దళారులను (జమీందార్లు) శివాజీ నిర్మూలించారు. వారికి ప్రయోజనం కలిగే విధంగా ప్రభుత్వ విధి విధానాలు రూపొందించి పాలకులకు, దుక్కి దున్నే వారికి అనుసంధానంగా నిలిచారు. రైతులకు విత్తనాలు, ఎద్దులు, రుణాలు అందించారు. కరువు సమయంలో పన్నులను నిలిపివేశారు. అలాగే వ్యవసాయ కార్మికులను, రైతులను ఏకం చేసి, భూస్వామ్య వ్యవస్థను (వతందారీ) వ్యతిరేకించి, సామాన్యుల రాజ్యాన్ని శివాజీ స్థాపించారని ఫూలే విశ్లేషించారు.



## పెరుగుతున్న బంగారం వెండి ధరలు

పెళ్లిళ్ల సీజన్ వేళ బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. నిన్న మొన్నటి వరకు పెద్దగా మార్పులు లేని ధరలు మళ్లీ పైపైకి వెళ్తున్నాయి. గురువారం మరోసారి ధరల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర బుధవారం రూ.1,54,200 ఉండగా నేడు రూ.2,290 పెరిగి రూ.1,56,490కి చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర బుధవారం రూ.1,41,350 ఉండగా నేడు రూ.2,100 పెరిగి రూ.1,43,450కి చేరుకుంది. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలో వెండి ధర బుధవారం రూ.2,60,000 ఉండగా నేడు రూ.10,000 పెరిగి ప్రస్తుతం రూ.2,70,000కు చేరుకుంది.



## బ్రేకప్ చెప్పిందని ప్రియురాలిపై సుత్తితో దాడి

సూర్యాపేట జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఓ ప్రియుడు తనను దూరం పెడుతుందనే కారణంలో ప్రియురాలిపై సుత్తితో దాడి చేశాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని స్నేహానగర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే_ _ _. సూర్యాపేటకు చెందిన మహేష్, స్నేహానగర్‌కు చెందిన ఓ యువతి కొంతకాలంగా ప్రేమించుకున్నారు. అయితే ఇటీవల సదరు యువతి మహేష్‌ను దూరం పెడుతూ వస్తోంది. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో మహేష్ కొంతకాలంగా అసహనంతో రగిలిపోతున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే గురువారం ఉదయం ఎవ్వరూ లేని సమయంలో యువతి ఇంట్లోకి వెళ్లాడు. ఏమైందో ఏమోగానీ సుత్తితో యువతి తలపై బలంగా దాడి చేశాడు. దీంతో ఆ యువతి కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. నిందితుడు మహేష్‌ను పట్టుకుని స్థంభానికి కట్టేసి చితకబాదారు. మరోవైపు గాయపడిన సదరు యువతిని సూర్యాపేట స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువతి పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# హ్యాట్రిక్ డకౌట్లు

టీ20ల్లో నంబర్ 1 బ్యాటర్.. ఇంకేముంది వరల్డ్‌కప్‌లో వీరకొట్టుడుతో వైరలవుతాడు.. భారత జట్టు మూడో కప్ప విజయంలో అభిషేక్ శర్మ కీలకమవుతాడని సెలెక్టర్లే కాదు అభిమానులూ అనుకున్నారు. కానీ, సీన్ రివర్సవుతోంది. టీమిండియాకు ప్రధాన బలంగా ఎదిగిన అతడే ఇప్పుడు ప్రధాన బలహీనతగా మారాడు. అవును.. ఏడాది కాలంగా నిలకడగా రాణించిన అభిషేక్ మెగాటోర్నీలో మాత్రం డకౌట్లతో వార్తల్లో నిలుస్తున్నాడు. పవర్ హిట్టర్‌గా జట్టుకు శుభారంభం ఇస్తాడనుకుంటే.. పేలవ షాట్లతో వికెట్ ఇచ్చేసి మిగతా వారిపై ఒత్తిడి పెంచుతున్నాడు. అమెరికాపై తొలి ఓవర్లోనే ఔటైన అభిషేక్.. పాక్‌పై, నెదర్లాండ్స్‌పైనా సున్నా చుట్టేశాడు. స్వదేశంలో పొట్టి ప్రపంచకప్ ఆడుతున్న భారత జట్టు ఓపెనర్ అభిషేక్ శర్మపై కొండంత నమ్మకం పెట్టుకుంది. 200లకు పైగా స్ట్రయిక్ రేటుతో రెచ్చిపోయే ఈ చిచ్చరపిడుగు చెలరేగితే.. ప్రత్యర్థిని సగం దెబ్బతీసేయొచ్చు అని




సూర్యకుమార్ సేన భావించింది. ఏమైందో తెలియదు.. మెగాటోర్నీలో మాత్ర మనోడు వరుసగా సున్నాలు చుట్టేస్తున్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ గమనాన్ని మార్చగల ఈ డాషింగ్ బ్యాటర్ తొలి ఓవర్లోనే పెవిలియన్ చేరుతున్నాడు. వరల్డ్ నంబర్ 1 బ్యాటర్‌గా ప్రపంచకప్‌లో ఆడుతున్న అతడు.. మూడు డకౌట్లతో చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు. ఈ ఏడాది ఏకంగా ఐదుసార్లు అతడు ఖాతా తెరవలేదు. ఒక క్యాలండర్ ఇయర్లో అత్యధిక డకౌట్ల(ఆరు పర్యాయాలు)తో పాక్ ఓపెనర్ సయీం ఆయూబ్ ముందున్నాడు.




## అభిషేక్ శర్మపై గావస్కర్ కీలక వ్యాఖ్యలు

టీమిండియా విధ్వంసకర ఓపెనర్‌గా పేరొందిన అభిషేక్ శర్మ వైఫల్యాలు కొనసాగుతున్నాయి. టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో ఆడిన మూడు మ్యాచ్‌లలోనూ డకౌట్ అయి.. లీగ్ దశను అవమానకర రీతిలో ముగించాడు. గ్రూప్-ఎలో భాగంగా యూఎస్ఏ మ్యాచ్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరిగిన అభిషేక్ శర్మ.. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లోనూ డకౌట్ అయ్యాడు. తాజాగా నిన్న(బుధవారం) నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లోనూ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఈ నేపథ్యంలో అభిషేక్ శర్మపై టీమిండియా దిగ్గజం సునీల్ గావస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఓ స్పోర్ట్స్ ఛానల్ కు సంబంధించిన షోలో గావస్కర్ మాట్లాడుతూ.. 'అభిషేక్ శర్మ ముందుగా ఒత్తిడి నుంచి బయటపడాలి. విధ్వంసకర ప్లేయర్‌ను అనే తనకున్న ట్యాగ్‌ను మరచిపోయి స్వేచ్ఛగా ఆడినప్పుడే అనుకున్న ఫలితం రాబట్టగలడు. తొందరపడకుండా తెలివిగా షాట్లు ఆడాలి.



## జూబ్లీహిల్స్‌లో చైన్ స్నాచింగ్‌కి పాల్పడిన జంట అరెస్ట్

జూబ్లీహిల్స్ చైన్ స్నాచింగ్‌కి పాల్పడిన జంటను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ జంట ఆంధ్రప్రదేశ్ పారిపోతుంటే.. తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో వీరిని పోలీసులు గుర్తించి.. అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి.. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారిని పోలీసులు విచారించారు. జల్సాల కోసం ప్రియుడితో కలిసి ఆమె ఈ పనులకు పాల్పడినట్లు పోలీసులు వివరించారు. ఆమె వయస్సు 33, అతడి వయస్సు 23 అని విచారణలో వెల్లడించారని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ మాదాపూర్‌లో హాస్టల్‌లో నివాసం ఉంటున్న కె. మానస జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 31లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తోంది. మంగళవారం (17-02-2026) ఉదయం హాస్టల్ నుంచి ఆఫీసుకు రోడ్డుపై నడుచుకుంటూవెళ్తోంది. జూబ్లీహిల్స్ రోడ్డు నెం 44 వద్దకు ఆమె రాగానే.. ఎదురుగా యాక్టివా బైక్‌పై వచ్చిన యువకుడు బండిని అకస్మాత్తుగా ఆపేశాడు. ఆ బండిపై వెనుక సీట్ల ఉన్న యువతి మానస మెడలోని బంగారు గొలుసు లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలు వెంటనే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఘటన స్థలంలో సీసీ ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. అందుకు సంబంధించి సీసీ ఫుటేజ్‌లను సేకరించి.. అన్ని పోలీస్ స్టేషన్లకు పంపారు. ఇక తెలుగు రాష్ట్రాల సరిహద్దుల వద్ద తనిఖీల్లో భాగంగా పోలీసులకు ఈ జంట పట్టుబడ్డారు.

# అతిథులకి అదిరిపోయే సర్‌ప్రైజ్‌లు

టాలీవుడ్‌లో మోస్ట్ లవబుల్ కపుల్ విజయ్ దేవరకొండ-రష్మిక మందాన పెళ్లి వేడుకలకు రంగం సిద్ధమైంది. ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని అందమైన నగరం ఉదయ్‌పూర్‌లోని ఓ అద్భుతమైన ప్యాలెస్‌లో వీరి వివాహం సన్నిహిత కుటుంబ సభ్యులు, అత్యంత ఆత్మీయుల సమక్షంలో జరగనుందని సమాచారం. అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టార్ హోటల్‌లో భారీ రిసెప్షన్ నిర్వహించనున్నారు. ఇప్పటికే విజయ్ నివాసం వద్ద లైటింగ్ డెకరేషన్లు ఏర్పాటు చేశారు. పెళ్లి కార్డులు కూడా ఎంపిక చేసిన అతిథులకు పంపిణీ చేస్తున్నారు. అయితే ఈ పెళ్లి ఆహ్వాన పత్రిక ప్రత్యేకతే ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణ కార్డు మాదిరిగా కాకుండా, ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఒక లగ్జరీ బాక్స్‌లో ఆహ్వాన పత్రికను అందిస్తున్నారు. ఈ బాక్స్‌లో పెళ్లి కార్డుతో పాటు అతిథులకు సర్‌ప్రైజ్ గిఫ్ట్స్ కూడా ఏర్పాటు చేశారు. ఈ




వెడ్డింగ్ కార్డ్ బాక్స్‌లో ఉన్న అంశాలు మరింత ఆసక్తికరంగా మారాయి. రష్మిక ప్రారంభించనున్న పెర్ఫ్యూమ్ బ్రాండ్‌కు చెందిన "నేషనల్ క్రష్" పేరుతో ఒక మినీ పెర్ఫ్యూమ్ బాటిల్‌ను అందిస్తున్నారు. అదనంగా చేతులు, కాళ్లకు ఉపయోగించే ఒక ఆయుర్వేదిక్ క్రీమ్‌ను కూడా చేర్చారు. విజయ్‌కు చెందిన ప్రసిద్ధ 'రౌడీ' బ్రాండ్ టీ-షర్ట్‌ను బాక్స్‌లో ప్రత్యేకంగా ఉంచారు. అంతేకాకుండా జీడిపప్పు ప్యాకెట్, ఒక స్వీట్ బాక్స్‌ను కూడా అందిస్తున్నారు. ఈ ప్రత్యేక వెడ్డింగ్ కార్డ్ బాక్స్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది..



## టెన్త్ విద్యార్థులపై విద్యాశాఖ కొత్త ప్లాన్

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలను మెరుగుపరిచేందుకు తెలంగాణ విద్యాశాఖ సరికొత్త ప్రణాళికను సిద్ధం చేసింది. మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా 'సపోర్టివ్ ప్లాన్' అమలు చేయాలని నిర్ణయించింది. దీని ప్రకారం, విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి వారిని మూడు గ్రూపులుగా విభజించి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ప్రీ-ఫైనల్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను వర్గీకరిస్తారు. కనీస మార్కులు సాధించడంలో ఇబ్బంది పడుతున్న వారిని 'స్ట్రగ్లర్స్' (కేటగిరీ-1) గా, సగటు మార్కులు తెచ్చుకుంటున్న వారిని 'యావరేజ్' (కేటగిరీ-2) గా, అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న వారిని 'అడ్వాన్స్‌డ్' (కేటగిరీ-3) గా విభజిస్తారు. ప్రతి కేటగిరీ విద్యార్థులకు వారి స్థాయికి అనుగుణంగా బోధన ఉంటుంది. వెనుకబడిన విద్యార్థులు సులువుగా పాస్ అయ్యేలా, ప్రతిభావంతులు 10/10 జీపీఏ సాధించేలా ప్రోత్సహిస్తారు. ఈ ఏడాది పరీక్షల మధ్య 3 నుంచి 4 రోజుల సెలవులు ఉన్న నేపథ్యంలో, ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించింది.

## కరాచీ బిల్డింగ్‌లో గ్యాస్ లీకేజీ ఘటన.. పేలుడు వల్ల 16 మంది మృతి, 14 మందికి గాయాలు

పాకిస్థాన్‌లోని కరాచీలో పేలుడు ఘటన జరిగింది. ఓ రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో గ్యాస్ లీకేజీ వల్ల పేలుడు జరిగింది. ఆ ప్రమాదంలో 16 మంది మరణించారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారు. కరాచీలోని సోల్జర్ బజార్ ఏరియాలో దుర్ఘటన జరిగింది. గుల్ రాణా కాలనీ ఏరియాలో ఉన్న ఓ బిల్డింగ్‌లో ప్రమాదం జరిగినట్లు అధికారులు చెప్పారు. గాయపడ్డవారిని సివిల్ ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజామున 4.15 నిమిషాలకు బిల్డింగ్ తొలి ఫ్లోర్‌లో గ్యాస్ లీకేజీ పేలుడు ఘటన జరిగినట్లు తెలుస్తోందని ఏఎస్పీ జెంషెడ్ అషేర్ తెలిపారు. గ్యాస్ పేలుడు వల్ల బిల్డింగ్‌లో కొంత భాగం కూలినట్లు రెస్క్యూ టీమ్ ఆఫీసర్ డాక్టర్ అబిద్ జలాలుద్దిన్ షేక్ తెలిపారు. మూడు అంతస్తుల బిల్డింగ్‌లో చిన్న చిన్న రూమ్‌లు ఉన్నాయని, స్థలం తక్కువగా ఉన్నందు వల్ల రెస్క్యూ ఆపరేషన్ సవాల్‌గా మారినట్లు చెప్పారు. మృతుల్లో 8 మంది మైనర్లు, నలుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. గాయపడ్డవారిని ఏడు మంది మైనర్లు ఉన్నారు.



నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4 PM




# చమురు వ్యూహం మార్చిన భారత్

దేశీయ ఇంధన అవసరాలను తీర్చుకోవడంలో భారత్ సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో.. రష్యా నుంచి దిగుమతులు తగ్గించి, వెనెజువెలా వైపు మొగ్గు చూపుతోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) తొలిసారిగా వెనెజువెలా నుంచి ముడిచమురు కొనుగోలు చేయగా, ప్రైవేటు సంస్థ హెచ్‌పీసీఎల్ మిట్టల్ ఎనర్జీ లిమిటెడ్ (హెచ్ఎంఈఎల్) రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ అక్కడి నుంచి దిగుమతులు చేపట్టింది.అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఈ రెండు రిఫైనరీలు చెరో 1 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేశాయి. ప్రముఖ గ్లోబల్ ట్రేడర్ 'విటోల్' ద్వారా ఈ ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. అయితే, ఈ వ్యవహారంపై రెండు సంస్థల నుంచి స్పందన రావాల్సిఉంది. షిప్పింగ్ ఖర్చులను తగ్గించుకోవడానికి ఈ రెండు ఆర్డర్లను ఒకే భారీ నౌక (వీఎల్ సీసీ) ద్వారా భారత్‌కు తరలించనున్నారు. బీపీసీఎల్ ఈ చమురును కేరళలోని కొచ్చి మరియు గుజరాత్‌లోని బీనా రిఫైనరీలకు తరలించనుంది. హెచ్ఎంఈఎల్ దీనిని గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్ ద్వారా పంజాబ్‌లోని బటిండా రిఫైనరీకి పంపనుంది.

# సుకుమార్ నాతో సినిమా ప్లాన్ చేశారు : దేవిశ్రీ ప్రసాద్



రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అదిరిపోయే మాస్ బీట్స్‌తో ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు మ్యూజిక్ అందించిన దేవిశ్రీ.. తాజాగా హీరోగా ప్రేక్షకులను పలుకరించనున్నాడు. 'బలగం' ఫేమ్ వేణు యెల్దండి దర్శకత్వంలో తెరకెక్కుతున్న బిగ్గెస్ట్ మూవీ "ఎల్లమ్మ" తో దేవిశ్రీప్రసాద్ హీరోగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాను శ్రీవేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజ్ అయిన ఎల్లమ్మ గ్లింప్స్ ఎంతగానో ఆకట్టుకోగా.. దేవిశ్రీ లుక్ సైతం అదిరిపోయింది. ఈ సినిమా కోసం ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉంటే తాజా ఇంటర్వ్యూలో దేవిశ్రీ ప్రసాద్ తన సినీ ప్రయాణంపై ఆసక్తికర విషయాలను వెల్లడించారు. దర్శకుడు సుకుమార్ తనను హీరోగా పరిచయం చేయాలని.. ఒక సినిమా ప్లాన్ చేసినట్లు తెలిపారు. అయితే తన తండ్రి మరణం తర్వాత ఆ ప్రాజెక్ట్ నిలిచిపోయిందని చెప్పారు. తనకు నటనపై ఆసక్తి ఉందని, అయితే సరైన సమయం, కథ కోసం ఎదురు చూస్తున్నట్లు దేవిశ్రీ వెల్లడించారు. దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, హరీశ్ శంకర్, అలాగే నిర్మాత దిల్ రాజు ఎప్పటికప్పుడు నటన వైపు అడుగులు వేయాలని తనను ప్రోత్సహిస్తూనే ఉన్నారని తెలిపారు.



# స్వదేశంలో ట్రంప్ పట్ల తీవ్ర వ్యతిరేకత.. తాజా సర్వే వెల్లడి



అమెరికా 48వ అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలోనే ఆయన రేటింగ్ అత్యంత దారుణంగా పడిపోయింది. తాజాగా యాహూ/యుగోవ్ నిర్వహించిన సర్వేలో 40 శాతం మంది అమెరికన్లు ట్రంప్‌ను 'అమెరికా చరిత్రలోనే అత్యంత చెత్త అధ్యక్షుడు'గా పేర్కొన్నారు. గతంలో అమెరికా అధ్యక్ష బాధ్యతలు నిర్వహించిన ఎవరికీ ఈ స్థాయిలో వ్యతిరేకత ఎదురుకాలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కేవలం 12 శాతం మంది మాత్రమే ట్రంప్‌ను 'అద్భుతమైన అధ్యక్షుడు' గా భావిస్తుండగా.. 53% మంది ఆయనను 'విఫల అధ్యక్షుడు' గా ముద్ర వేశారు. ట్రంప్ ఆమోదం రేటింగ్ 39 శాతానికి పడిపోగా.. వ్యతిరేకత 58 శాతానికి పెరిగింది. ముఖ్యంగా వలస వ్యతిరేక విధానాలు, హెచ్-1బీ వీసా నిబంధనల కఠినత, మరియు వాణిజ్య యుద్ధం వంటి నిర్ణయాలపై అమెరికన్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.





## ఆకట్టుకుంటున్న 'విష్ణు విన్యాసం' టీజర్

టాలీవుడ్ యంగ్ హీరో, విలక్షణమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే శ్రీ విష్ణు తాజాగా 'విష్ణు విన్యాసం' అనే కామెడీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికరమైన టీజర్‌ను చిత్ర యూనిట్ బుధవారం ఘనంగా విడుదల చేసింది. ఈ సినిమాలో శ్రీ విష్ణు 'చిన్నా' అనే పాత్రలో కనిపిస్తుండగా, జాతకాలు మరియు వాస్తుపై విపరీతమైన నమ్మకంతో అతను చేసే పనులు, దాని చుట్టూ తిరిగే గందరగోళం టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు యదునాథ్ మారుతీ రావు ఈ చిత్రాన్ని ఒంగోలు నేపథ్యంతో మలిచారు, ఈ చిత్రానికి రధన్ సంగీతాన్ని అందిస్తుండగా, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మిస్తున్నారు.

122 ఏండ్ల తర్వాత తెరుచుకోనున్న


# 'కోణార్క్' గర్భ గుడి



ఒడిశాలోని 13వ శతాబ్దపు కోణార్క్ సూర్య దేవాలయ గర్భ గుడిలోకి త్వరలో భక్తులు ప్రవేశించే అవకాశం రానున్నది. ప్రస్తుతం ఆ స్థలం ఇసుకతో నిండి ఉంది. దాన్ని ఇప్పుడు తొలగిస్తున్నారు. ఆలయం వెనుక ఉన్న 15 అడుగుల ఎత్తయిన గోడ కూలిపోకుండా నిరోధించడానికి బ్రిటిష్ పాలకులు 1903-04లో గర్భ గుడిని వేల టన్నుల ఇసుకతో నింపారు. జగ్‌మోహన్ హాల్‌గా పిలిచే ఈ ప్రాంతంలోకి శతాబ్దం పాటు ఎవరూ ప్రవేశించలేదు. తాజాగా భారత పురావస్తు శాఖ, ఐఐటీ మద్రాస్ నిపుణులతో కూడిన బృందం ఈ ఇసుకను తొలగించే పని చేపట్టింది. మొత్తం ఇసుకను తరలించడానికి మూడు నెలలు పడుతుందని ఓ పురావస్తు శాఖ అధికారి తెలిపారు. ఇసుకను తరలించిన తర్వాత లోపలి గోడల పటిష్ఠతను పరిశీలించి గుడి పునర్ నిర్మాణంపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు.

## కర్రెగుట్టలో భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోయిస్టులు హతం

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టలో మరోసారి తుపాకీల మోత మోగింది. భద్రతా బలగాలు ఇక్కడ భారీ ఎన్‌కౌంటర్ నిర్వహించాయి. ఈ ఎన్ కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్ట్ అగ్రనేతలు కూడా ఉన్నారని సమాచారం. ఆపరేషన్ 2 కగార్ పేరుతో కేంద్రరాష్ట్ర బలగాల భారీ కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మావోయిస్ట్ అగ్ర నేతలే టార్గెట్‌గా ఆపరేషన్ 2 కగార్ చేపట్టారు. మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని ఇంతకు ముందే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంకా నలభై రోజులే మిగిలి ఉన్నందున ఆపరేషన్ కగార్ వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. దాదాపు 5 వేల మంది సీఆర్పీఎఫ్ జవాన్లతో కర్రె గుట్టలో భారీ ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నారు.




# ఏపీలో భూకంపం

ఏపీలో భూప్రకంపనలు భయాందోళనలు సృష్టించాయి. పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 3.5 తీవ్రత నమోదైంది. ఈ విషయాన్ని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ నిర్ధారించింది. వినుకొండకు 20 కిలోమీటర్ల దూరంలో భూఉపరితలానికి 10 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించింది. తెల్లవారుజామున 2:33 గంటలకు భూ ప్రకంపనలు వచ్చాయని తెలిపింది. ఈ భూకంప ప్రభావంతో పల్నాడు జిల్లాలోని వినుకొండతో పాటు దర్శి, చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ భూమి కంపించింది. అకస్మాత్తుగా భూమి కంపించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అయితే స్వల్ప ప్రకంపనల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని తెలుస్తోంది. అయితే, రానున్న రోజుల్లో మరిన్ని ప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి 'లోక' సీక్వెల్

'లోక: చాప్టర్ 1' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది మలయాళీ భామ కల్యాణి ప్రియదర్శన్. ఈ సూపర్ ఉమెన్ ఫాంటసీ థ్రిల్లర్‌లో ఆమె అభినయానికి సర్వత్రా ప్రశంసలు దక్కాయి. గత ఏడాది మలయాళంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'లోక: చాప్టర్ 1' రికార్డులు సృష్టించింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సీక్వెల్ గురించి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవలే ఓ ఈవెంట్‌లో పాల్గొన్న కల్యాణి ప్రియదర్శన్ సీక్వెల్‌లో తాను భాగమవుతున్నానని వెల్లడించింది. ప్రస్తుతం స్క్రిప్ట్‌వర్క్‌లో ఉన్న ఈ సినిమా సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి వెళ్తుందని, సీక్వెల్‌లో విజువల్స్‌కు అధిక ప్రాధాన్యం ఉంటుందని.. కథ, కథనాలు మరింత ఉత్కంఠను పంచుతాయని తెలిపింది.

## వచ్చే ఎన్నికలే లక్ష్యం: కొత్త పార్టీపై కవిత కీలక ప్రకటన



వచ్చే ఎన్నికలే లక్ష్యంగా తాను సరికొత్త రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించబోతున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త పార్టీకి సంబంధించిన విధివిధానాలు సిద్ధమయ్యాయని, మే మొదటి వారంలో పార్టీ పేరును అధికారికంగా ప్రకటిస్తానని ఆమె వెల్లడించారు. పార్టీ పేరులో తెలంగాణ అనే పదం ఉంటుందని ఆమె తెలిపారు. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘంలో పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ప్రారంభమైనట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో తాను ఖచ్చితంగా పోటీ చేస్తానని కవిత పేర్కొన్నారు. తన మొదటి ప్రాధాన్యత సిద్దిపేట అని, ఒకవేళ కుదరకపోతే రెండో ఎంపికగా బోధన్ నుంచి బరిలోకి దిగుతానని ఆమె తెలిపారు. అయితే ఎన్నికల వ్యూహంలో భాగంగా రాష్ట్రంలోని ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రాబోయే ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ఉండదని, తమ పార్టీయే ప్రధాన ప్రతిపక్షంగా అవతరిస్తుందని తెలిపారు. ప్రజా క్షేత్రంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.